క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక అంబకపల్లె రోడ్డులో ఉన్న విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట మంగళవారం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ హక్కుల, సంక్షేమం కోసం పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. పదేళ్ల సర్వీస్ పని చేసిన వారికి సర్వీస్ ఇన్‌స్టెంట్ న్యూస్ కాంటాక్ట్ ఉద్యోగులను పర్మిట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేవరకు కార్యక్రమాలు చేపడతామన్నారు.

రెండోరోజుకు చేరిన నిరసన

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఏపీఎస్పీ జేఏసీ పిలుపు మేరకు చేస్తున్న నిరసన రెండోరోజు మంగళవారంకు చేరింది. ఈ సందర్భంగా ఆర్టీపీపీ పవర్ హౌస్ గేటు వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలు 22వ తేదీ వరకు ఉంటాయన్నారు. యజమాన్యం తన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనలు దశలవారిగా చేపబడుతామన్నారు.

ప్రజలను వ్యాధుల బారిన పడకుండా కాపాడండి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో దోమలు అధికమై ప్రజలు వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని వెంటనే దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మంగళవారం వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి మాడిశెట్టి శివకుమార్ ఆధ్వర్యంలో కమిషనర్ శేషఫణికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల దోమల బెడద అధికమైందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమయం పాటించకుంటే చర్యలు

ఎర్రగుంట్ల : సమయం పాటించని సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ రామాంజనేయరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ సభా భవనంలో మండల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న ఇంటి, నీటి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. అలాగే తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్వామిత్ర సమగ్రా భూసర్వేను సచివాలయ ఉద్యోగులు తప్పక చేయాలన్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణయ్య, ఈఓపీఆర్డీ రహమతుల్లయ్య, పంచాయతీ రాజ్ ఏఈ వినయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్మోహన్‌రెడ్డి, సచివాయల ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

కమలాపురం : జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామని మండల పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం మండలానికి 8600 వ్యాక్సిన్ డోసులు మంజూరు అయ్యాయని, నాలుగు నెలలు దాటిన ఆవులు, గేదెలన్నింటికి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది మీ గ్రామాలకు వచ్చినప్పుడు రైతులు తప్పని సరిగా తమ పశువులకు ఈ టీకాలు వేసుకోవాలన్నారు.

ప్రభుత్వం స్పందించాలి

పులివెందుల టౌన్ : పీఆర్సీ కమిటీ ఏర్పాటు, ఐఆర్ మంజూరుపై ప్రభుత్వం స్పందించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోనూ, మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఉద్యోగ, పెన్షనర్లకు 2024 జనవరి నుండి ఇప్పటివరకు నాలుగు డీఏలు బకాయి పడిందని, ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనప్పటికీ ఒక్క డీఏ కూడా మంజూరు చేయకుండా మొండిచేయి చూపిస్తోందన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు, ఆర్థికపరమైన, విద్యారంగపరమైన సమస్యల సాధన కోసం అక్టోబర్ 7న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

ప్రమాదంలో గాయాలు

ముద్దనూరు : చాపాడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన గంగయ్య మంగళవారం మండలంలోని సోంపల్లెకు ఎరువుకోసం వచ్చాడు. సోంపల్లెలో ట్రాక్టరులో ఎరువును నింపుకుని తిరుగు ప్రయాణంలో మాదన్నగారిపల్లె సమీపానికి వచ్చేసరికి ట్రాక్టరు అదుపుతప్పి గంగయ్య ట్రాక్టరు చక్రం కింద పడిపోయాడు. కాలుకు తీవ్ర గాయమైందని 108 సిబ్బంది తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురంలో మంగళవారం దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు. శానిటరీ సెక్రటరీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు.

రబీపైనే రైతుల ఆశలన్నీ..



పంటల సాగుకు పొలం దున్నుతున్న ట్రాక్టర్



వ్యవసాయ పనులు చేస్తున్న రైతు



రబీ సాగుకు సిద్ధంగా ఉన్న పొలాలు

- గ్రామాల్లో ఊపందుకున్న సేద్యం పనులు
- నియోజకవర్గంలో 50 వేలకుపైనే సాగు
- పెరిగిన ఎరువుల ధరలతో అదనపు ఖర్చులు

వేముల : ఈ ఏడాది రబీపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే అదునులో పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ రైతులను నిరాశపరిచింది. ఖరీఫ్‌లో వర్షాలు లేక పంటలు సాగు కాకపోయినా రబీపైనే దృష్టి పెట్టి సాగుకు సిద్ధమవుతున్నారు. పులివెందుల నియోజకవర్గంలో రబీ సాగులో 50వేల ఎకరాలకుపైనే అన్ని రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 20 శాతం మేర రబీలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు వ్యవసాయ బోర్లు బావుల కింద మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. అక్టోబరు నెలలో వర్షాలు కురిస్తే బుడ్డశనగ, మినుము తదితర పంటలు సాగు చేసేందుకు రైతులు ప్రత్యేక దృష్టి సారించారు.

గ్రామాల్లో ఊపందుకున వ్యవసాయ పనులు

రబీలో పంటల సాగుకు సీజన్ ముంచుకొస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. గ్రామాల్లో సేద్యపు పనులు ఊపందుకున్నాయి. రెండు వారాలపాటు వర్షాలు పడటంతో పొలాల్లో కలుపు మొక్కలు పెరిగిపోయాయి. దీంతో రైతులు పొలాల్లో ట్రాక్టర్లు, ఎద్దులతో వ్యవసాయ పనులు చేస్తున్నారు. వ్యవసాయ పనులలో బాడుగ ఖర్చులు రైతులకు భారంగా మారుతున్నాయి. రైతులు యంత్రాలతోనే సేద్యాలు చేసేందుకు అలవాటుపడ్డారు. గ్రామాల్లో వెతికినా కాడెద్దులు కనిపించని పరిస్థితి. దీంతో రైతులు యాంత్రీకరణ పద్ధతులవైపు మొగ్గు చూపుతున్నారు. భూములను సేద్యం చేయాలంటే ఎకరాకు రూ.700లు, ఎద్దులకు ఎకరాకు రూ.600లు బాడుగ తీసుకుంటున్నారు. దీంతో ఎకరాకు పంట సాగుకు సిద్ధం చేయాలంటే రూ.2వేలకుపైనే బాడుగ ఖర్చులు వస్తున్నాయని రైతులు అంటున్నారు.

పెరిగిన ఎరువుల ధరలతో అదనపు ఖర్చులు

రైతులు పంటలు సాగు చేయాలంటే ముందుగా సేద్యాలు చేయడం, రసాయనిక ఎరువులు విత్తడం, వర్షాలు వస్తే పంటలు సాగు చేయడం ఇన్ని రకాల పనులు చేస్తేనే పొలాల్లో పంటలు సాగు చేయలేని పరిస్థితి. రసాయనిక ఎరువుల ధరలు పెరగడంతో అదనంగా ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. రసాయనిక ఎరువుల బస్తా కొనుగోలు చేయాలంటే రూ.1700లకుపైనే చెల్లించాల్సి వస్తోంది. దీంతోనే రైతుల పంటలు సాగుచేసి ఆశించిన మేర దిగుబడులు లేకపోతే తీవ్రంగా నష్టపోతున్నారు. రైతల వద్ద చిల్లి గవ్వ లేకపోతే పంటలు ఎలా సాగు చేస్తాడు. దీంతోనే రైతులు పెట్టుబడులు పెట్టాలంటే అప్పుల కోసం వెంపర్లాడుతున్నారు. అప్పు తెచ్చి పంటలు సాగు చేసినా పండుతుందో, ఎండుతుందో తెలియని పరిస్థితి.

రబీపైనే ఆశలు పెట్టుకున్నాం



ఈ ఏడాది రబీపైనే ఆశలు పెట్టుకున్నాం. ఖరీఫ్‌లో వర్షాభావం నెలకొని పంటలు సాగు కాలేదు. రబీలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సాగవుతాయనే ఆశతో ఉన్నాం. రబీ సాగుకు సిద్ధమవుతున్నాం. ఖరీఫ్ లేకపోయినా రబీ అయినా ఆదుకుంటుందని అనుకుంటున్నాం.

\- గంగిరెడ్డి, రైతు, గొందిపల్లె

పెట్టుబడులు భారమవుతున్నాయి



పంటల సాగులో పెట్టుబడులు భారమవుతున్నాయి. పెట్టుబడులు అయినా దిగుబడులు వస్తాయనే నమ్మకం లేకుండా పోతోంది. పంటలు సాగు చేశాక అనంతరం వర్షాలు లేక పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతోనే పెట్టుబడులు పెట్టాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.

\- ప్రకాష్‌రెడ్డి, రైతు, గొందిపల్లె

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ నాయకులు

పులివెందుల టౌన్ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు సాధన కోసం దశల వారి ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు గఫూర్ తెలిపారు. మంగళవారం స్థానిక గఫూర్ డ్రైవింగ్ స్కూలులో ఈనెల 20వ తేదీన ఎస్ఈ విద్యుత్ భవన్ వద్ద నిర్వహించే విద్యుత్ కార్మికుల ధర్నా కరపత్రాలను అయన పులివెందుల కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి, నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2022 పీఆర్సీ అరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలన్నారు. కొత్త ఆపరేటర్లందరికి పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లను స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని, ప్రతి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నైట్‌వాచ్‌ను వినియోగించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ ధర్నాలో ప్రతి విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ స్క్రాప్‌పై కొనసాగుతున్న విచారణ



గేటు వద్ద ఉంచిన ట్రాక్టర్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని స్క్రాప్ బయటకు తరలింపుపై ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సోమవారం ఓ ట్రాక్టర్ పాత ఇనుము సామగ్రితో బయటకు రావడం పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. కొందరు ఎస్‌పీఎఫ్ సిబ్బంది అవినీతి కారణంగానే పాత ఇనుము చోరీకి గురవుతుందని పరిశ్రమకు చెందిన పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఘటనపై ఆర్టీపీపీ సీఈ ఆగ్రహం వ్యక్తం చేసి సంబంధిత బాధ్యులపై చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. పాత ఇనుము తరలిస్తున్న వ్యక్తులు పరిశ్రమలోనే పనిచేస్తున్నట్లు తెలిసింది. పాత ఇనుముతో కూడిన ట్రాక్టర్‌ను పరిశ్రమలోనే ఉంచి విచారణ జరుపుతుండటం గమనార్హం. మంగళవారం సీఈ చాంబర్‌లో ఆర్టీపీపీ విజిలెన్స్, ఎస్‌పీఎఫ్, ఎస్ఈలతో ఈ వ్యవహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావును వివరణ కోరగా తాము సీసీ పుటేజ్‌లను పరిశీలించి బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ముగ్గురు ఎస్‌పీఎఫ్ సిబ్బందిపై ఉన్నతాధికారులకు నివేధిక సమర్పించామని ఆయన గుర్తు చేశారు.

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి



డివైజర్‌లను అందిస్తున్న డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ రాజ్యలక్ష్మి

వీరపునాయునిపల్లె : డ్వాక్రా సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని వెలుగు కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు గొర్రెలు, బర్రెలు పెంచుకునేందుకు, అలాగే వ్యవసాయం సాగు చేయుటకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారిని ముందుగానే గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతోందన్నారు. డ్వాక్రా మహిళల కొరకు త్వరలో మన డబ్బులు, మన లెక్కలు ప్రత్యేక యాప్ త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ యాప్ ద్వారా డ్వాక్రా మహిళలు ఎంత రుణం తీసుకున్నారు, ఎంత చెల్లించారు, ఎంత అప్పు ఉన్నదో ఈజీగా తెలుసుకోవచ్చన్నారు. అనంతరం ఆమె వీఓలకు డివైజర్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు అర్చన, సీసీలు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పెండ్లిమర్రి : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు శ్రీధర్ లింగారెడ్డి, సహాయ సంచాలకులు మాధవిలు తెలిపారు. మంగళవారం మండలంలోని ఏనుగువారిపల్లె, గోపులాపురం, నందిమండలం గ్రామాలల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేసే కార్యక్రమం నిర్వహించారు. మూడు గ్రామాలల్లో 700పైగా పశువులకు ఉచితంగా టీకాలు వేశామన్నారు.

వేధింపుల కేసు నమోదు

ముద్దనూరు : భార్యను అదనపు కట్నం తెమ్మని, పిల్లలు పుట్టరని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడని భర్త రమణారెడ్డిపై వరలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని కోడిగాండ్లపల్లెకు చెందిన వరలక్ష్మికి 30 సంవత్సరాల క్రితం దేనేపల్లె గ్రామానికి చెందిన రమణారెడ్డితో వివాహం జరిగింది. అప్పట్లో కట్నం కింద 3 తులాల బంగారు ఇచ్చారు. పెళ్లి అయిన 5 సంవత్సరాల తర్వాత రమణారెడ్డి కువైట్‌కు వెళ్ళాడు. తిరిగివచ్చిన తర్వాత భార్యాభర్తలిద్దరూ ప్రొద్దుటూరులో సంసారమున్నారు. ఆ సమయంలో రమణారెడ్డి మరో మహిళతో అక్రమసంబంధం పెట్టుకుని భార్యను వేధిస్తూ ఉండేవాడు. అయితే ఇటీవల రమణారెడ్డి నీకు పిల్లలు పుట్టరని, అదనంగా కట్నం తేవాలని వేధిస్తుండటంతో బాధితురాలు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు రమణారెడ్డిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.లక్ష వితరణ

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న దీనబంధు మానసిక వికలాంగుల ఆశ్రమానికి మంగళవారం వేంపల్లెకు చెందిన రిటైర్డు ఎంఈఓ రామ్మోహన్‌రెడ్డి కుమారుడు హరికిరణ్‌రెడ్డి రూ.లక్ష వితరణగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ తన కుమార్తె ధృతి పుట్టిన రోజు సందర్భంగా మానసిక వికలాంగులకు ఆరు నెలలపాటు ప్రతిరోజు భోజనం ఏర్పాటు చేసేందుకు రూ.లక్ష నగదును అందించానన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : దివ్యాంగ చిన్నారులను ఆదుకోవడం మనందరి బాధ్యత అని ఎంఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక భవిత దివ్యాంగుల వనరుల కేంద్రంలో రిటైర్డు ఎంఈఓ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి కుమారుడు హరికిరణ్‌రెడ్డి చిన్నారుల సంక్షేమానికి రూ.50వేల విరాళాన్ని అందించారు. హరికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సొమ్ముతో దివ్యాంగ చిన్నారులకు అవసరమైన ఫిజియోథెరపీ పరికరాలను, పిల్లలకు ప్రతి రోజు పాలు, పండ్లను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 స్టాలిన్ ఐజాక్, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

వేంపల్లె : ఓజోన్ పొరను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. మంగళవారం ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ - స్థిరత్వంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : ఓజోన్ పొర పరిరక్షణ మనందరి బాధ్యత అని సైన్స్ ఉపాధ్యాయులు పి.సనవుల్లా తెలిపారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్లాంపురంలోని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి



చింతకొమ్మదిన్నె : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జేడీ చంద్రానాయక్



కమలాపురం : రైతులతో మాట్లాడుతున్న ఏఓ సరస్వతి



లింగాల : పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ

చింతకొమ్మదిన్నె : మండలంలోని రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేయిచుకోవాలని వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ సూచించారు. మంగళవారం ఓబులంపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కారక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక దిగుబడులు సాధించే విధంగా వ్యవసాయం లాభసాటిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఈశ్వర్‌రెడ్డి, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జి రామ్మోహనరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు చేసుకోవాలి

కమలాపురం : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం నల్లలింగాపల్లె, తురకపల్లెల్లో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో మినుము, శనగ, పెసర పంటలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆర్ఎస్‌కేలో నిర్వహించిన సమావేశంలో రైతులతో మాట్లాడుతూ పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని మన గ్రోమోర్ కేంద్రంతో పాటు సంబటూరు ఆర్ఎస్‌కేలో బుధవారం యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఏఓ సరస్వతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతితో కలసి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఇ-పాస్ మిషన్ ద్వారా స్టాక్ రిపోర్ట్‌ను సేకరించి, ఫిజికల్ స్టాక్‌ను పరిశీలించారు. ప్రతి రోజు తప్పని సరిగా ఓపెనింగ్ బ్యాలెన్స్, క్లోజింగ్ బ్యాలెన్స్‌లను అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

లింగాల : సాగు చేసిన ప్రతి పంటకు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం లోపట్నూతల, లింగాల గ్రామాల్లో ఆయన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు ఆధారంగానే రైతులకు పంటల బీమా, పంట నష్ట పరిహారం, వడ్డీలేని పంట రుణాలు తదితర పథకాలకు అర్హులవుతారన్నారు. పంట నమోదును సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది రాణి, రైతులు పాల్గొన్నారు.

జీవామృతం పిచికారి చేయాలి

పులివెందుల రూరల్ : వేరుశనగ పంటలో ఐరన్ లోప నివారణకు జీవామృతాన్ని పిచికారి చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం వెంకటాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వేరుశనగ పంటలో పోషకాల లోపం, ఐరన్ లోపాలను ఆయన గుర్తించారు. వాటి నివారణకు జీవామృతాన్ని పిచికారి చేసుకోవాలన్నారు.